ఎన్డీయేకు బీహార్ బ్రేకులు!

- గత ఎన్నికల్లో 40 స్థానాల్లో 39 గెలుపు
- ఈసారి గట్టి పోటీ ఇస్తున్న విపక్ష కూటమి
- కలిసిరానున్న కమ్యూనిస్టుల ఓటుబ్యాంకు
- తోడవుతున్న తేజస్వీ యాదవ్ చరిష్మా

పట్నా, ఏప్రిల్ 10: మూడోసారి కేంద్రంలో అధికారంలోకి రావాలని పట్టుదలగా ఉన్న ఎన్డీయేకు ఈసారి బీహార్‌లో బ్రేకులు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ ఎన్డీయేకు కలిసొచ్చిన బీహార్‌లో ఇప్పుడు గట్టి పోటీ ఎదురవుతున్నది. ఈసారి 400 లోక్‌సభ స్థానాలను సొంతం చేసుకోవాలనుకుంటున్న ఎన్డీయే.. ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు బీహార్ అత్యంత కీలకమైన రాష్ట్రం. ఇక్కడ 2014 ఎన్నికల్లో 40 స్థానాలకు గానూ బీజేపీ, ఎల్‌జేపీ, ఆర్ఎల్ఎస్‌పీతో కూడిన ఎన్డీయే కూటమి 31 స్థానాలను గెలుచుకుంది. 2019 ఎన్నికల్లో ఏకంగా 40 స్థానాలకు 39 స్థానాలను కైవసం చేసుకుంది. ఈసారి కూడా ఇదే స్థాయిలో స్థానాలను గెలవాలని ఎన్డీయే భావిస్తున్నప్పటికీ అది అంత సులువైన పనిలా కనిపించడం లేదు.

మారిన సమీకరణాలు

గత ఎన్నికలకు, ఇప్పటికి బీహార్‌లో రాజకీయ సమీకరణాలు మారినట్టు స్పష్టమవుతున్నది. 2019 ఎన్నికల్లో బీజేపీ, జేడీయూ, ఎల్జేపీతో కూడిన ఎన్డీయే కూటమికి 53 శాతం ఓటుబ్యాంకు లభించింది. ఆ ఎన్నికల్లో ఆర్జేడీ - కాంగ్రెస్ కూటమిగా పోటీ చేయగా 31 శాతం ఓట్లను సాధించింది. సీపీఐ, సీపీఎం, సీపీఐ-ఎంఎల్ పార్టీలు వేరు కూటమిగా పోటీ చేసి 3 శాతం ఓట్లు సాధించాయి. ఇప్పుడు మాత్రం ఈ మూడు కమ్యూనిస్టు పార్టీలూ ఇండియా కూటమిలో భాగంగా ఉన్నాయి. దీంతో ఆర్జేడీ, కాంగ్రెస్‌కు ఇప్పుడు కమ్యూనిస్టుల బలం కలిసి రానున్నది. మరోవైపు గత ఎన్నికల్లో ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న లోక్ జనశక్తి పార్టీ ఇప్పుడు రెండుగా చీలింది. రామ్‌విలాస్ పాశ్వాన్ సోదరుడు పశుపతి కుమార్ పరాస్ నేతృత్వంలో ఏర్పడిన రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ(ఆర్ఎల్‌జేపీ) ఎన్డీయే నుంచి బయటకు రావడం మైనస్ కావచ్చు. గత ఎన్నికల్లో పార్టీలు సాధించిన ఓట్లను బట్టి చూస్తే ఎన్డీయే బలం తగ్గగా, ఇండియా కూటమి బలం పెరిగినట్టు కనిపిస్తున్నది.

తగ్గిన నితీశ్ ప్రభావం.. పెరిగిన తేజస్వీ చరిష్మా

బీహార్‌కు తొమ్మిదోసారి ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ కుమార్ ప్రభావం క్రమంగా తగ్గుతున్నది. ఈ ఎన్నికల్లో ఎన్డీయేతో పొత్తులో భాగంగా నితీశ్ నేతృత్వంలోని జేడీయూ 16 స్థానాల్లో పోటీ చేస్తుండగా బీజేపీ మాత్రం 17 స్థానాల్లో బరిలో దిగుతున్నది. తద్వారా బీహార్ వరకు ఎన్డీయే కూటమిలో బీజేపీనే పెద్ద పార్టీగా మారింది. తరచూ కూటములు మార్చడం, మొన్నటి వరకు ఇండియా కూటమిలో ఉండి బీజేపీని విమర్శించి ఇప్పుడు అదే పార్టీతో జట్టు కట్టడం వంటి అంశాల వల్ల బీహార్ ప్రజల్లో నితీశ్ విశ్వసనీయత తగ్గుతున్నదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు లాలూ వారసుడిగా రాజకీయ ప్రవేశం చేసిన ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్ ఇప్పుడు బీహార్‌లో ప్రధాన నాయకుడిగా అవతరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీహార్‌లో ఆర్జేడీని అతిపెద్ద పార్టీగా నిలిపిన ఘనత తేజస్వీదే. ఇప్పుడు ఇండియా కూటమిలోనూ ఆర్జేడీనే 25 స్థానాలకు పోటీ చేస్తుండటం ద్వారా ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తున్న పార్టీగా నిలిచింది. తేజస్వీ యాదవ్ బీహార్ ప్రజల్లో, ముఖ్యంగా యువతలో పట్టు సంపాదించుకున్నారు. ఆయన వ్యక్తిగత చరిష్మా ఈసారి ఇండియా కూటమికి కలిసొచ్చే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి.

ఎన్డీయేపై ప్రభుత్వ వ్యతిరేకత

గత ఎన్నికల్లోలా ఈసారి బీహార్‌లో క్లీన్‌స్వీప్ చేసే పరిస్థితులు ఎన్డీయేకు లేవని ఆ కూటమి నేతలు కూడా అంగీకరిస్తున్నారు. గత ఎన్నికల ఫలితాలను ఎన్డీయే పునరావృతం చేయడం కష్టమేనని జేడీయూ నేత నీరజ్ కుమార్ పేర్కొన్నారు. పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న నితీశ్ కుమార్ ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావం ఎన్డీయేపై చూపించే అవకాశాలు ఉన్నాయి. సామాజిక సమీకరణాలను చూస్తే.. ఆర్జేడీ మొదటి నుంచి ముస్లిం - యాదవ ఓట్లను ఓటుబ్యాంకుగా మలుచుకున్నది. అయితే, దళితుల్లో పట్టున్న చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్జేపీ భాగస్వామిగా ఉండటం ఎన్డీయేకు కలిసి రావచ్చు. నితీశ్ కుమార్‌కు వెనుకబడిన వర్గాలు, కుర్మి, కోయిరి సామాజికవర్గాల్లో ఆదరణ ఉంది.

అక్రమాస్తుల కేసులో డీకేకు లోకాయుక్త నోటీసులు

ఎన్నికల వేళ కీలక పరిణామం

బెంగళూరు, ఏప్రిల్ 10: లోక్‌సభ ఎన్నికల ముంగిట కర్ణాటకలో కీలక పరిణామం చోటుచేసుకున్నది. అక్రమాస్తుల కేసులో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు లోకాయుక్త నోటీసులు జారీచేసింది. కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు అందజేయాలని ఆదేశించింది. డీకే అక్రమాస్తుల కేసును మునుపటి బీజేపీ సర్కారు సీబీఐకి అప్పగించగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ఉపసంహరించిన విషయం తెలిసిందే. అనంతరం కేసు లోకాయుక్తకు బదిలీ అయ్యింది. కేసు విచారణ సందర్భంగా సీబీఐకి సమర్పించిన పత్రాలను తమకు కూడా అందజేయాలని తాజాగా డీకేకు పంపిన నోటీసుల్లో లోకాయుక్త కోరింది. ఆదాయానికి మించి రూ.74.93 కోట్లు అక్రమాస్తులు కూడబెట్టారని డీకే శివకుమార్‌పై ఆరోపణలు ఉన్నాయి.

యువతికి బీజేపీ ఎంపీ ముద్దు

బెంగాల్ ఎన్నికల ప్రచారంలో ఘటన

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రచారంలో భాగంగా వీధుల్ని శుభ్రం చేయడం, పసి పిల్లలకు స్నానాలు చేయించడం వంటి పనులను రాజకీయనేతలు చేస్తుంటారు. అయితే, బెంగాల్‌లోని ఉత్తర మాల్దా బీజేపీ ఎంపీ ఖగేన్ ముర్మూ తాజాగా చేసిన ఓ పని వివాదాన్ని రేపింది. సోమవారం శ్రీహిపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారానికి వెళ్లిన ఆయన.. ఓ యువతి చెంపపై ముద్దు పెట్టారు. దీనిపై విమర్శలు రావడంతో స్పందించిన ఎంపీ.. సదరు యువతిని కుమార్తెగా భావించే అలా చేశానని చెప్పుకొచ్చారు.

అవినీతి యూనివర్సిటీకి మోదీయే చాన్స్‌లర్

తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

తెని (తమిళనాడు): ప్రధాని మోదీపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ విరుచుకుపడ్డారు. అవినీతి యూనివర్సిటీకి చాన్స్‌లర్ కావడానికి మోదీయే తగిన వ్యక్తి అని పేర్కొన్నారు. బుధవారం ఎన్నికల సభలో ఆయన మాట్లాడుతూ వారసత్వ రాజకీయాలు, రాష్ట్రంలోని అవినీతిపై ప్రధాని చేసిన విమర్శలపై స్పందించిన ఆయన 'ఒకవేళ అవినీతి యూనివర్సిటీని కనుక ఏర్పాటు చేయాలంటే దానికి చాన్స్‌లర్ కావడానికి మోదీ సరైన వ్యక్తి అవుతారు' అని విమర్శించారు. అవినీతి నేతలను పరిశుద్ధులను చేసే బీజేపీ వాషింగ్ మెషీన్ వరకు బీజేపీ అవినీతి పార్టీ అని తేటతెల్లం చేస్తుందని పేర్కొన్నారు.

చిలక పలుకు.. పంపింది జైలుకు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్,(నమస్తే తెలంగాణ): రోడ్డుపక్కన చిలక జోస్యం చెప్పుకొనేవారిని తరుచూ చూస్తూనే ఉంటాం. తమిళనాడులోని కడలూరుకు చెందిన ఇద్దరు సోదరులు కూడా ఇలాగే చిలకజోస్యం చెప్పుకొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పీఎంకే కడలూర్ ఎంపీ అభ్యర్థి ధంకూర్ బచ్చన్ ఇటీవల ప్రచారం చేస్తూ అటువైపుగా వచ్చారు. పనిలోపనిగా చిలక జోష్యం చెప్పించుకొన్నారు. వచ్చే ఎన్నికల్లో బచ్చన్ తప్పకుండా గెలుస్తారని జ్యోతిషులు చెప్పారు. ఈ వార్త చివరకు పోలీసుల చెవిలో పడింది. దీంతో ఆ ఇద్దరు జ్యోతిష్యులను పోలీసులు అరెస్టు చేశారు. తన గెలుపు వార్తను ఓర్వలేకే అధికార డీఎంకే నేతలు సామాన్యులను అరెస్టులతో వేధిస్తున్నారని బచ్చన్.. స్టాలిన్ సర్కారుపై మండిపడ్డారు. అయితే, చిలకలను బోనులో బంధించిన కారణంతో వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972 కింద మాత్రమే జ్యోతిష్యులను అరెస్టు చేసినట్టు పోలీసులు పేర్కొనడం గమనార్హం.

అనామక రాజకీయ హోర్డింగ్‌లపై ఈసీ నజర్

ఇకపై పోస్టర్లు, హోర్డింగ్‌లపై ప్రింటర్,పబ్లిషర్ వివరాలు ఉండాల్సిందే

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల వేళ దేశవ్యాప్తంగా విస్తృతంగా ఏర్పాటు చేసిన అనామక రాజకీయ హోర్డింగ్‌లపై ఎన్నికల సంఘం కన్నెర్ర చేసింది. ఊరూపేరూ లేకుండా ఎవరు ఏర్పాటు చేశారో తెలియకుండా పార్టీలకు ప్రచారం చేస్తున్న హోర్డింగ్‌లపై దృష్టి సారించింది. అభ్యర్థులు తాము ప్రచారం చేసే కరపత్రాలు, హోర్డింగ్‌లు, ఇతర ప్రచార సామగ్రిపై తప్పనిసరిగా ప్రింటర్, పబ్లిషర్ పేరును స్పష్టంగా ప్రచురించాలని ఆదేశించింది. ఎన్నికల ప్రచారంలో పారదర్శకత కోసం ఈ నిబంధన తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. మున్సిపల్ శాఖ, ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో ఇప్పటికే పలు చోట్ల ఏర్పాటు చేసిన కొన్ని హోర్డింగ్‌ల ద్వారా చేస్తున్న పార్టీ ప్రచారంలో ఆయా పబ్లిషర్, ప్రింటర్ పేర్లు ఉండటం లేదంటూ ఆప్, మరి కొందరి నుంచి వచ్చిన ఫిర్యాదులు పరిశీలించిన అనంతరం ఈసీ ఈ ఆదేశాలిచ్చింది.

బీజేపీ టికెట్ కాదని.. స్వతంత్రంగా బరిలోకి

భోజ్‌పురి స్టార్ సింగర్ సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: పవన్‌సింగ్.. ప్రముఖ భోజ్‌పురి గాయకుడు, నటుడు. బెంగాల్‌లోని అసన్‌సోల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయాలని ఆయనకు బీజేపీ టికెట్ కేటాయించగా, దాన్ని తిరస్కరించి పోటీ నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. తాజాగా అదే పవన్‌సింగ్ బీహార్‌లోని కర్‌కత్ స్థానం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు బుధవారం ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. 'మాతా గురుతర భూమేరు' అంటే తల్లి ఈ భూమి కంటే గొప్పదని, తాను ఈ సారి ఎన్నికల్లో పోటీ చేస్తానని తన అమ్మకు హామీ ఇచ్చానని పవన్‌సింగ్ ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. బీహార్‌లోని కర్‌కత్ నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. ఇక్కడ ఆర్జేడీ నేతృత్వం లోని మహాకూటమిలో భాగమైన సీపీఐ(ఎల్ఎల్) లిబరేషన్‌కు చెందిన రాజారామ్ సింగ్‌తో పవన్ సింగ్ తలపడనున్నారు.

చర్యలకు సిద్ధంగా ఉండండి

పతంజలి కేసులో సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కోర్టు ధిక్కారణపై క్షమాపణలు చెబుతూ పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకులు రాందేవ్ బాబా, బాలకృష్ణ దాఖలు చేసిన అఫిడవిట్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. వారి క్షమాపణలను అంగీకరించబోమని, చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది. బుధవారం కోర్టు పతంజలి యాడ్స్ కేసును విచారించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో చర్యలు తీసుకోనందుకు ఉత్తరాఖండ్ లైసెన్సింగ్ అథారిటీలోని ముగ్గురు అధికారులను సస్పెండ్ చేయాలని ఆదేశాలు ఇచ్చింది.

ఆ 23 శునక జాతులపై నిషేధం చెల్లదు

కర్ణాటక హైకోర్టు ఆదేశం

బెంగళూరు: దేశంలో 23 శునక జాతులను ప్రమాదకరమైనవని పేర్కొంటూ వాటిపై నిషేధం విధిస్తూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను కర్ణాటక హైకోర్టు బుధవారం కొట్టివేసింది. ఈ నిషేధ ఉత్తర్వులు జారీ చేసే ముందు కేంద్రం ఆయా జాతి శునకాల యజమానులు, సంబంధిత సంస్థలను సంప్రదించి ఉండాల్సిందని వ్యాఖ్యానించింది.

కబళిస్తున్న హెపటైటిస్

- ప్రపంచంలోనే భారత్ రెండో స్థానం
- ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడి



జెనీవా, ఏప్రిల్ 10: భారత్‌లో హెపటైటిస్ బీ, సీ కేసులు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. 2022లో అత్యధిక హెపటైటిస్ (కాలేయ వాపు) కేసులు నమోదైన దేశాల జాబితాలో చైనా మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో ఉన్నది. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మంగళవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వైరల్ హెపటైటిస్ వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజూ 3,500 మంది చనిపోతున్నారని డబ్ల్యూహెచ్‌వో ఆందోళన వ్యక్తం చేసింది. ఏటా 13 లక్షల మంది మృత్యువాతపడుతున్నారని పేర్కొన్నది. ఇందులో 83 శాతం హెపటైటిస్ బీ కారణంగా సంభవిస్తుండగా, 17 శాతం మరణాలకు హెపటైటిస్ సీ కారణమని వివరించింది.

హెపటైటిస్ విజృంభణ ఇలా..



2022లో హెపటైటిస్ కేసులు

చైనా	8.3 కోట్లు
భారత్	3.5 కోట్లు

హెపటైటిస్ బీ కేసులు	హెపటైటిస్ సీ కేసులు	హెపటైటిస్ కారణంగా ప్రపంచంలో మరణాలు
ప్రపంచవ్యాప్తంగా 25.4 కోట్లు	ప్రపంచవ్యాప్తంగా 5 కోట్లు	2019- 11 లక్షలు
భారత్‌లో 2.98 కోట్లు	భారత్‌లో 55 లక్షలు	2022-13 లక్షలు

ఢిల్లీ మంత్రి రాజీనామా

- ఆప్‌ను వీడిన రాజ్‌కుమార్ ఆనంద్
- పార్టీ అవినీతిలో కూరుకుపోయింది
- దళితులకు గౌరవం లేదని ఆరోపణ
- ఈడీ, సీబీఐతో ఆప్‌ను చీల్చే కుట్రలు
- బీజేపీపై ఎంపీ సంజయ్ ధ్వజం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: లోక్‌సభ ఎన్నికల వేళ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో ఇప్పటికే సతమతమవుతున్న ఆమ్‌ఆద్మీ పార్టీకి మరో షాక్ తగిలింది. ఢిల్లీ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్ బుధవారం తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆప్‌లో దళితులకు ప్రాతినిధ్యం ఇవ్వడం లేదని, పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని ఆయన ఆరోపణలు చేశారు. కేజ్రీవాల్ క్యాబినెట్‌లో రాజ్‌కుమార్ సాంఘిక సంక్షేమ శాఖతో పాటు పలు ఇతర శాఖలు కూడా నిర్వహిస్తున్నారు. ఆయన పటేల్ నగర్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఢిల్లీలో రాజ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఆప్ అగ్రనేతల్లో ఒక్క దళితుడు కూడా లేరన్నారు. పార్టీలో దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లకు గౌరవం లేదని ఆరోపించారు. కేజ్రీవాల్‌ను ఉద్దేశించి కూడా విమర్శలు చేశారు. ఒకసారి రాజకీయాలు మారితే, దేశం మారుతుందని గతంలో జంతర్‌మంతర్ వేదికగా కేజ్రీవాల్ చెప్పారని, అయితే 'రాజకీయాలు మారలేదు, రాజకీయ నేతలే మారారు' అంటూ వ్యాఖ్యానించారు.

రాజ్‌కుమార్ ఆనంద్‌కు బెదిరింపులు!

మంత్రి రాజీనామాపై ఆప్ స్పందించింది. తమ పార్టీని అంతం చేసే లక్ష్యంలో భాగంగా కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారన్న తమ వాదనకు తాజా పరిణామం బలాన్నిచ్చిందని పేర్కొన్నది. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ సీబీఐ, ఈడీ సంస్థలను ఉపయోగించుకొని తమ మంత్రులు, ఎమ్మెల్యేల్లో చీలిక తేవాలని బీజేపీ కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. ఇది ఆప్ మంత్రులు, ఎమ్మెల్యేలకు అగ్నిపరీక్షా సమయం అని వ్యాఖ్యానించారు. తమ పార్టీని చీల్చేందుకు చేసే కుట్రలకు వ్యతిరేకంగా బలంగా నిలబడుతామని పేర్కొన్నారు. గతంలో ఈడీ దాడుల సమయంలో అవినీతిపరుడు అంటూ విమర్శించిన రాజ్‌కుమార్ ఆనంద్‌ను.. ఇప్పుడు అదే బీజేపీ ఆయన్ను పూలమాలతో వాళ్ల పార్టీలోకి ఆహ్వానిస్తుందని అన్నారు. ఆప్ నుంచి బయటకు రావాలని ఆనంద్‌ను ఎవరైనా బెదిరించి ఉండొచ్చని మంత్రి భరద్వాజ్ అన్నారు.

సుప్రీంకోర్టుకు కేజ్రీవాల్

మద్యం పాలసీ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ సీఎం కేజ్రీవాల్ బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని కోరారు. స్పందించిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ వీలైనంత త్వరగా పిటిషన్‌ను లిస్టింగ్ చేసేందుకు పరిగణనలోకి తీసుకొంటామన్నారు. మరోవైపు ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్‌ను తొలగించాలని పదేపదే పిటిషన్లు దాఖలు చేయడంపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఇదేమైనా జేమ్స్ బాండ్ సినిమానా? సీక్వెల్స్ ఉండటానికి..' అని వ్యాఖ్యానించింది. ఈ విధమైన పిటిషన్లను పదేపదే ఎందుకు వేస్తున్నారని పిటిషన్‌దారుపై అసహనం వ్యక్తం చేసింది. ఈ అంశంపై వచ్చిన పిటిషన్లపై ఇప్పటికే విచారణ చేశామని, సీఎం తొలగింపు అంశం కార్యనిర్వాహక పరిధిలోకి వస్తుందని, దానిపై గవర్నర్ నిర్ణయం తీసుకొంటారని స్పష్టం చేసింది.

సాంబార్ లేని ఇడ్లీ రసం లేని వడ

మొదటిపేజీ తరువాయి...

ఇంటిముందు నాలుగైదు డ్రమ్ములు, సింథటిక్ ట్యాంకులు దర్శనమిస్తున్నాయి. నీటిలభ్యత లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో వారానికి ఒకసారి స్నానాలు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. నగరంలో మొత్తం 13,900 బోరుబావులు ఉంటే అందులో ఇప్పటికే 6,900 బోర్లు ఎండిపోయాయి. మిగిలిన బోర్లలో 1,500 అడుగుల లోతులోనే కొద్దిమొత్తంలోనే నీళ్లు ఉన్నాయి. 'మా ఇంట్లోని బోరుబావి కూడా ఎండిపోయింద'ని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్వయంగా పేర్కొనడం బెంగళూరు నీటి కష్టాలకు అద్దంపడుతున్నది. నీటి కరువు దృష్ట్యా భవన నిర్మాణాలపై ప్రభుత్వం ఇప్పటికే నిషేధం విధించింది.

చేతులెత్తేసిన సర్కారు

మంచినీటి లభ్యత లేకపోవడంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు, ఆర్వో యూనిట్లను ప్రభుత్వం మూసివేసింది. పనిచేస్తున్న ఒకటీ, రెండు యూనిట్లలో నీటి చార్జీలను రెట్టింపు చేసింది. దీంతో ప్రభుత్వ వైఖరిపై పాదచారులు, రోడ్డు మీద వ్యాపారాలు చేసుకొనేవారు మండిపడుతున్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాల్సిందిపోయి.. డబ్బులు పిండుకోవడమేంటని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. నీటి సరఫరాను సవ్యంగా చేయని సర్కారు వైఖరిని వ్యతిరేకిస్తూ పలువురు అపార్ట్‌మెంట్ వాసులు, గేటెడ్ కమ్యూనిటీల్లోని ప్రజలు నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

వాటర్ మాఫియా పడగ

బెంగళూరులోని 25 శాతం మేర నీటి అవసరాలను తీరుస్తున్న నీటి ట్యాంకర్ల యజమానులు కూడా ధరలను అమాంతం పెంచేశారని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో రూ.750 పలికే నీటి ట్యాంకర్.. ఇప్పుడు రూ. 2000 చెప్తున్నట్టు వాపోతున్నారు. రూ. 20 విలువచేసే 20 లీటర్ల వాటర్ క్యాన్‌ను రూ. 100 నుంచి రూ. 120 ధరకు విక్రయిస్తున్నట్టు మండిపడుతున్నారు. వాటర్ మాఫియా చెలరేగిపోతున్నప్పటికీ, ప్రభుత్వం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు.

నగరం నుంచి వలసలు

నీటి కటకటను భరించలేని కొందరు టెకీలు, ప్రైవేటు ఉద్యోగులు బెంగళూరును వదిలిపెట్టి తాత్కాలికంగా స్వస్థలాలకు పయనమవుతున్నారు. వర్క్‌ఫ్రమ్‌హోమ్ ఆప్షన్‌ను ఉపయోగించుకొని కొందరు, ప్రత్యేక అనుమతితో మరికొందరు ఇలా వలసబాట పట్టారు. స్నానాలు చేయడం కోసమే కొందరు శివారు ప్రాంతాల్లోని కుంటలకు ప్రయాణమవుతున్న ఘటనలు కూడా ఉన్నాయి. నీటి కటకటతో కొందరు యజమానులు ఇళ్లు ఖాళీ చేయాల్సిందిగా అద్దెకు ఉండేవారిపై ఒత్తిడి తెస్తున్నారు.

టాయిలెట్లకు టోకెన్ సిస్టమ్

నీటి కొరత పెరుగుతుండటంతో హోటల్, రెస్టారెంట్లలో వాడిపారేసే ప్లేట్లను మాత్రమే వినియోగిస్తున్నారు. జగ్గుల్లో నీటి సరఫరాను బంద్ చేశారు. నీరు ఎక్కువగా అవసరపడే సాంబార్, రసం వంటి వంటకాలను మెనూ నుంచి తొలిగిస్తున్నారు. ఐటీ కంపెనీలు ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్‌హోమ్‌లను పొడిగిస్తున్నాయి. మాల్స్‌లో టాయిలెట్లను వినియోగించే కస్టమర్స్‌కు టోకెన్ సిస్టమ్‌ను తీసుకొచ్చారు.

మూగజీవాలు మృత్యువాత

నీటి కటకట అటు ప్రజలనే కాదు.. ఇటు మూగజీవాలను కూడా బలిపెడుతున్నది. బెంగళూరుకు సమీపంలోని రామనగర జిల్లా అడవిలో నీటి కుంట కోసం 50 కి.మీ. మేర తిరిగిన రెండు ఏనుగులు చివరకు దాహంతో మృత్యువాతపడ్డాయి. నగరంలోని కుక్కలు, కోతులు నీటి కోసం ఇండ్లల్లోకి వచ్చి దాడులకు పాల్పడుతున్నాయి.

కలరా విజృంభణ

కొరత కారణంగా రేట్లను పెంచిన కొందరు అక్రమార్కులు శుద్ధమైన నీటినైనా సరఫరా చేస్తున్నారా? అంటే అదీలేదు. నగర శివారుల్లోని కుంటల నుంచి తీసుకొచ్చిన నీటిని శుద్ధిచేయకుండా అలాగే సరఫరా చేస్తున్నారు. దీంతో ఈ కలుషిత నీటిని తాగి.. బెంగళూరు మెడికల్ కాలేజీ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (బీఎంసీఆర్ఐ)కి చెందిన విద్యార్థులు 47 మంది అస్వస్థతకు గురై దవాఖాన పాలయ్యారు. ఇందులో ఇద్దరికి కలరా సోకినట్టు గుర్తించారు. ఇలా మొత్తంగా గడిచిన రెండు నెలల్లోనే నగరంలో 8 మంది కలరాబారిన పడ్డారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్ షెడ్యూల్ మార్పు

చెన్నై, ఏప్రిల్ 10: ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు రిజిస్ట్రేషన్ల షెడ్యూల్‌ను మార్చినట్టు ఐఐటీ-మద్రాస్ ప్రకటించింది. ఇంతకుముందు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఏప్రిల్ 21 నుంచి 30 వరకు అడ్వాన్స్‌డ్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. ఇప్పుడు ఏప్రిల్ 27 నుంచి మే 7 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునేలా షెడ్యూల్ మార్చారు. పరీక్ష తేదీలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. ముందుగా నిర్ణయించిన ప్రకారమే మే 26న పరీక్ష జరుగుతుంది.

మేనేజ్‌మెంట్ స్టడీస్ టాప్-25లో ఐఐఎం అహ్మదాబాద్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ప్రపంచంలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అత్యుత్తమ విద్యాసంస్థల్లో ఐఐఎం-అహ్మదాబాద్ టాప్-25లో నిలిచింది. ఐఐఎం-బెంగళూరు, ఐఐఎం-కలకత్తా టాప్-50లో నిలిచాయి. ఇక, డెవలప్‌మెంట్ స్టడీస్‌లో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రపంచవ్యాప్తంగా 20వ స్థానంలో నిలవగా, భారత్‌లో నంబర్ వన్ స్థానంలో ఉన్నది. ఈ మేరకు లండన్‌లోని అధ్యయన సంస్థ క్వాక్వెరెల్లీ సైమండ్స్ (క్యూఎస్) వెల్లడించింది. రిసెర్చ్ సెంటర్ల పరంగా భారత్ గణనీయ వృద్ధి సాధించిందని వెల్లడైంది.

6,9,11 తరగతులకు క్రెడిట్లు

సీబీఎస్ఈ పైలట్ ప్రాజెక్ట్

న్యూఢిల్లీ: ఆరు, తొమ్మిది, పదకొండు తరగతులకు 'నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్' ను వర్తింపజేస్తూ సీబీఎస్ఈ పైలట్ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఈ పైలట్ ప్రాజెక్ట్‌లో పాల్గొనేందుకు తమ అనుబంధ స్కూల్స్‌ను ఆహ్వానిస్తున్నామని సీబీఎస్ఈ అధికారులు బుధవారం వెల్లడించారు. క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ అమలుకు సంబంధించి మార్గదర్శకాలను సీబీఎస్ఈ సిద్ధం చేసింది.కేంద్రం గతేడాది 'జాతీయ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్' ను ఆవిష్కరించింది. దీని ప్రకారం, ప్రీప్రైమరీ నుంచి పీహెచ్‌డీ వరకు